## క్లుప్తంగా

### 28న సాధన మండలిలో రుషి పంచమి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఈనెల 28వ తేదీన రుషి పంచమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుర్లె అరుణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాతాజీ సరస్వతమ్మ, జ్ఞాన చైతన్య, పసుపులేటి వేణుగోపాలస్వామి ఆశీస్సులతో ఆ రోజు ఆధ్యాత్మిక వేత్తలైన వారిని సప్త రుషులుగా భావించి పూజించనున్నట్లు పేర్కొన్నారు.

### దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి




బాపట్ల: రజకులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాలకొండయ్య డిమాండ్ చేశారు. కారంచేడులో రజక బాలికపై దాడి చేసిన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ రజకులపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని తెలిపారు.

### నటుడు ఆదినారాయణకు అరుదైన సత్కారం




తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు ఆరాధ్యుల ఆదినారాయణకు అరుదైన సత్కారం లభించింది. గుంటూరుకు చెందిన శ్రీగౌరీశంకర నాట్యమండలి ఆధ్వర్యంలో నల్లచెరువు రామాలయం వద్ద ఆదివారం పౌరాణిక నాటకోత్సవం నిర్వహించారు. వివిధ నాటకాల్లోని సీన్లను ప్రదర్శించారు. శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుని పాత్రలో నటించిన ఆదినారాయణను 'కళాజ్యోత్స్న' బిరుదుతో సత్కరించి వెండి కిరీటాన్ని బహూకరించారు. 'ఆంధ్ర గానకోకిల' ఏవీ సుబ్బారావు మూడో కుమారుడైన ఆదినారాయణరావు తండ్రి, సోదరుల బాటలోనే కళారంగాన్ని నమ్ముకున్నారని.. తన ప్రతిభతో 'నంది', 'గరుడ' సహా అనేక పరిషత్ బహుమతులు, రాష్ట్ర ప్రభుత్వంతో 'కందుకూరి' పురస్కారాలను అందుకున్నారని నాట్యమండలి అధ్యక్షుడు సనిశెట్టి సాంబశివరావు ప్రశంసించారు. కార్యక్రమంలో కళాకారుల సంఘ నేత నలకా శ్రీనివాసరావు, నాయుడు గోపి, చెన్నుపాటి కృష్ణారావు, సిరిగిరి సాంబశివరావు, దర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పసుపు రైతులకు ఆర్థిక సహాయం



కొల్లిపర: పసుపు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్రీయ కృషి వికాష్ యోజన పథకం ద్వారా ఎకరానికి రూ.9,600 ఆర్థిక సహాయం అందిస్తుందని.. ఈ అవకాశాన్ని పసుపు సాగు చేస్తున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెనాలి హార్టికల్చర్ అధికారిణి తోటకూర శ్రీనిత్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రధానంగా శీలం, బీఎస్ఆర్, మైదుకూరు వంటి రకాల పసుపు సాగు చేస్తున్న రైతులు మాత్రమే నమోదు చేసుకోవాలన్నారు. ఈ పథకం కోసం రైతులు తమ వెంట ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, సాగు చేస్తున్న భూమి 1బీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో తీసుకుని సమీపంలోని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ శాఖ లేదా హార్టికల్చర్ సిబ్బందిని కలిసి అర్జీ పొందం తీసుకుని నమోదు చేయాలని సూచించారు. కావున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

### నూతన రోడ్లు, కాలువలు నిర్మించాలి



తెనాలి అర్బన్: 28వ వార్డులో నూతన రోడ్డు నిర్మించాలని.. ఐతానగర్ సిద్ధార్థ కాలనీలో నూతన కాలువలు నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. గాంధీనగర్‌లో ఆక్రమణలు తొలగించాలని ఒకరు వినతిపత్రం ఇచ్చారు. వీటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మట్టి గణపతే.. మహా గణపతి!

- ప్రకృతి మీద మక్కువతో 7 అడుగుల మట్టి గణపతి తయారీ
- మొదలైన చవితి వేడుకలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రతిమలు



7 అడుగుల మట్టి గణపతి విగ్రహం

భట్టిప్రోలు: రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, నదులు, కాలువల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరంతా కలుషితం అవుతోందని మండలంలోని పులిమి నారాయణ మట్టి గణపతిని రూపొందించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో ప్రకృతికి ముప్పని అతను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 7 అడుగుల మట్టి విగ్రహాన్ని రూపొందించి ప్రకృతికి హాని చేయని రంగులను అద్దారు. పర్యావరణ పరిరక్షణను గుర్తించిన నారాయణ భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన వారు.

**గ్రామాల్లో మొదలైన సందడి..**

గణనాథునికి పూజలు నిర్వహించేందుకు మండలంలోని అన్ని గ్రామల్లో భక్తులు ఉత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో వినాయక చవితి మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. మట్టి గణపతులనే పూజించాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్న నేపథ్యంలో కొందరు మట్టి ప్రతిమలనే విక్రయించే పనిలో ఉన్నారు. మరికొందరు ఇళ్లల్లోనే స్వయంగా మట్టి గణపతులను చేసి పూజించనున్నారు.

**రసాయన రంగులతో వ్యాధులు..**



రసాయనాలతో కూడిన విగ్రహాలు నిమజ్జనం చేసినప్పుడు అవి నీటిలో కలవడం వల్ల జల చరాలు నశిస్తాయి. అలాంటి నీటిలో మునగడం వల్ల మనుషులకు కూడా చర్మ, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయి. అదే మట్టితో తయారు చేసిన విగ్రహాల వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. అందుకు మట్టితో 7 అడుగుల వినాయకుని విగ్రహాన్ని రూపొందించాను. మట్టితో విగ్రహం చేయాలంటే శ్రమతో కూడుకున్న పని. కానీ ప్రకృతికి ఇది మైత్రి వంటిది.

– పులిమి నారాయణ, ఐలవరం

# పరిష్కార వేదికలో ఏడు అర్జీలు



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

రేపల్లె: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక చక్కని మార్గమని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి ఏడు అర్జీలు అందాయన్నారు. నూతన జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలు జరుగుతున్న నేపథ్యంలో తెనాలిని జిల్లా కేంద్రంగా ప్రకటించి రేపల్లె డివిజన్‌ను అందులో కలపాలని పట్టణ అభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహనరావు అర్జీ ఇచ్చారన్నారు. ఇతరత్రా సమస్యలపై ప్రజల నుంచి అందుకున్న మిగతా అర్జీలను పరిశీలించి ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వేమూరు: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గ్రీన్ అంబాసిడర్ నాయకులు బి.ఆగస్టీన్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శి భూపతిరెడ్డి, చావలి పంచాయతీ కార్యదర్శి అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, జంపని పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎం.కల్పనకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల ద్వారా అనేక పనులు చేయిస్తోందన్నారు. కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## ఆలయాల పాలక మండలి ప్రమాణ స్వీకారం



రామకృష్ణ సాయిబాబు



వెంకట కోటేశ్వర గుప్తా

చందోలు(కర్లపాలెం): బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ లింగోద్భవ స్వామి ఆలయాలకు నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌లు, సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. లింగోద్భవ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా పరిమి రామకృష్ణ సాయిబాబును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొలుత దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా రామకృష్ణ సాయిబాబు, కొత్తమాసు ధనలక్ష్మి, చెట్టుపల్లి సంపూర్ణ, బాడుగల రాజ్యలక్ష్మి, దొప్పలపూడి ఉషారాణి, ఉండవల్లి శ్రీమన్నారాయణ, పాట్లూరి వాణి, ఉయ్యూరి వెంకటేశ్వరరావు, బుద్దా నాగరాజు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా దండిబట్ల వెంకట సుబ్బయ్యలు ఆలయ ప్రాంగణంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

**శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో..**

శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఎందూరి లీలా నాగేంద్రసాయి వెంకట కోటేశ్వర గుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత ధర్మకర్తల మండలి సభ్యులుగా వెంకట కోటేశ్వర గుప్తాతో పాటు కల్లూరి హరికుమారి, అద్దేపల్లి ప్రభావతి, కత్తి నాగరాణి, గ్రంధి శ్రీనివాసరావు, ఇంటూరి నారాయణస్వామి, కర్రి వెంకట వరప్రసాద్, పోతార్లంక హేమలత, బాడుగల మాధవరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా వేదాంతం కృష్ణమాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

### సబ్ కలెక్టర్ పరిష్కార వేదికలో 12 అర్జీలు



తెనాలి టౌన్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 అర్జీలు వచ్చినట్లు సబ్‌కలెక్టర్ సంజనా సింహా తెలిపారు. రెవెన్యూ 3, మున్సిపల్ 3, పోలీసు 1, పంచాయతీరాజ్ 2, మెడికల్ 1, సబ్ రిజిస్టర్ కార్యాలయం 1, విద్యుత్ కార్యాలయానికి సంబంధించి 1, మొత్తం 12 అర్జీలు వచ్చాయని వీటిని సంబంధిత శాఖలకు బదలాయించి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తామని వివరించారు. అర్జీల్లో ఉన్న సమస్యలపై ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలు

తెనాలి: జాతీయస్థాయిలో ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకూ జరిగే నేత్రదాన పక్షోత్సవాలను సోమవారం పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవా సంస్థ 'విజ్ఞానవేదిక' ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు, నేత్ర సంరక్షణ, నేత్రదానంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. స్థానిక అయితానగర్‌లోని శ్రీ నన్నపనేని సరస్వతీ సీతారామయ్య స్మారక మున్సిపల్ హైస్కూలులో ఈ కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. విజ్ఞాన వేదిక అధ్యక్షుడు, ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాద్ మాట్లాడుతూ.. బాలబాలికలకు చిన్న వయసు నుంచి పర్యావరణ పరిజ్ఞానం, నేత్రాలకు సంక్రమించే వ్యాధులు, దృష్టిదోషాల నివారణ మార్గాలు, నేత్రదానం ఆవశ్యకత వంటి అంశాలపై అవగాహన కోసం కేంద్ర ప్రభుత్వం పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ కె.పుల్లారావు కంటి పరీక్షలను చేశారు. డాక్టర్ పి.భాస్కర్ నేత్రదానం ప్రాముఖ్యత, ఆవశ్యకతలను వివరించారు. ప్రధానోపాధ్యాయిని ఎస్.రాజ్యలక్ష్మి కార్యక్రమ ఆవశ్యకతను తెలియజేశారు.

### చేబ్రోలు ఎస్‌ఐగా వీరనారాయణ

చేబ్రోలు: చేబ్రోలు ఎస్‌ఐగా పి.వీరనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న డి.వెంకట కృష్ణను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమర్ ఉత్తర్వులు ఇచ్చారు. నల్లపాడు ఎస్‌ఐగా పనిచేస్తున్న వీరనారాయణను చేబ్రోలు పోలీసు స్టేషన్ ఎస్‌ఐ-1గా బదిలీ చేయటంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

# యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ సిబ్బంది



అమర్తలూరులో తనిఖీలు చేస్తున్న అధికారులు



భట్టిప్రోలులో దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

నగరం: యూరియాను అధిక ధరలకు విక్రయించినా.. కృత్రిమ కొరత సృష్టించిన కఠిన చర్యలు తప్పవని ఏవో రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని సజ్జావారిపాలెంలో ఎరువుల దుకాణంలో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. యూరియా కొరతను అధిగమించేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. సజ్జావారిపాలెంలోని ఎరువుల దుకాణంలో స్టాక్ వ్యత్యాసం ఉండడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దుకాణాల్లో తప్పని సరిగా స్టాక్ బోర్డులు, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.చంద్రశేఖర్, విజిలెన్స్ ఏవో ఆదినారాయణ పాల్గొన్నారు.

అమర్తలూరు(వేమూరు): ఎరువుల షాపుల నిర్వాహకులు ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నెహ్రూబాబు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని పలు ఎరువుల షాపులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, ఫెర్టిలైజరు షాపులు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలులో ఎరువుల దుకాణంలో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణదారులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయించడానికి వీలు లేదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల కార్యక్రమంలో విజిలెన్స్ ఏవో సీహెచ్ ఆదినారాయణ, సీఐ చంద్రశేఖర్, మండల వ్యవసాయ శాఖాధికారి బి.బ్రహ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపాలిటీకి రూ.లక్షల్లో ఆదాయం గండి



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జోగి రాజా

బాపట్ల అర్బన్: బాపట్ల మున్సిపాలిటీలో గుత్తేదారునికి అనుకూలంగా మున్సిపల్ అధికారులు నిబంధనలను పాటించకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు జోగి రాజా కలెక్టర్ జె.వెంకట మురళీ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మున్సిపల్ అధికారులు చేస్తున్న అవినీతిపై ఆయన ఫిర్యాదు చేశారు. రోడ్డు మార్జిన్ రుసుము వసూళ్ల వేలం పాట నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడంతో పాటు గుత్తేదారుడి నుంచి పాట సొమ్మును వసూలు చేయకుండా కాంట్రాక్టు నడుపుతున్నారని ఆయన ఆరోపించారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని రూ.లక్షల్లో గండికొడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని కోరారు. కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఐరన్ స్క్రాప్ విగ్రహం 'బుల్' ఆవిష్కరణ



శివాజీ విగ్రహానికి నమస్కరిస్తున్న అభిజిత్ గోఖలే

తెనాలి: సంస్కార భారతి అఖిలభారత సంఘటన కార్యదర్శి అభిజిత్ గోఖలే సోమవారం స్థానిక ఆటోనగర్ సమీపంలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీని ప్రత్యేకంగా సందర్శించారు. మూడు టన్నుల ఇనుప వ్యర్థ్యాలతో రూపొందించిన 'బుల్' విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆర్ట్ గ్యాలరీలోని వివిధ రకాల విగ్రహాలను తిలకించి, ఆయా విశేషాలను శిల్పకారులు 'కళారత్న' కాటూరి వెంకటేశ్వరరావు, కుమారులు కాటూరి రవిచంద్ర నుంచి ఆయన తెలుసుకున్నారు. గ్యాలరీలో కొలువుదీరిని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని చూడగానే పూలమాల వేసి భక్తిని ప్రదర్శించారు. కాంస్యం, ఫైబర్, పంచలోహ, స్టెయిన్లెస్ స్టీల్, ఐరన్ స్క్రాప్‌తో చేసిన విగ్రహాలతో కూడిన ఆర్ట్ గ్యాలరీ దేశంలో ఇదే ప్రథమమని ఈ సందర్భంగా కాటూరి వెల్లడించారు. అభిజిత్ గోఖలే మాట్లాడుతూ.. గ్యాలరీలోని ఐరన్‌స్క్రాప్ విగ్రహాలు బంగారు నగలను అతికినంత శ్రద్ధగా చేసినట్లు ఉన్నాయని ప్రశంసించారు. పురాణ పురుషులతో పాటు వల్లభాయ్ పటేల్ సహా రాజకీయ నేతల విగ్రహాలు జీవం ఉట్టిపడేలా ఉన్నాయని చెప్పారు. శిల్పకారులను అభినందించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ, కార్యదర్శి రామ్‌కుమార్, సభ్యులు అల్లు రాంబాబు, మురళీధర్ పాల్గొన్నారు.

# అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం!

- తొలి విడతగా 40 మందిపై వేటు!
- మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం



పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం

తెనాలి: పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విడతల వారీగా తొలగించేందుకు రంగం సిద్ధంచేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకున్నా, అధికారులే అత్యుత్సాహంతో ఇందుకు పూనుకున్నట్లు తెలిసింది. నేరుగా తొలగించాలని ఆదేశించినా, అందుకు దిగువ స్థాయి అధికారులు వ్యతిరేకించారు. దీంతో పద్ధతి ప్రకారం తొలగింపునకు సన్నాహాల్లో ఉన్నారు. దీంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఏడాది క్రితం తొలగింపు నోటీసులిచ్చి, అందరి వ్యతిరేకతతో వెనక్కి తగ్గినప్పటికీ మళ్లీ ఇప్పుడు పదవుల్లో ఉన్న అధికారులు ఇందుకు పూనుకున్నారు.

**కొనసాగించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం..**

2014–19 మధ్యకాలంలో టీడీపీ హయాంలో నియమితులైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కొనసాగించారు. ఖాళీలను మాత్రం భర్తీ చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు ఉపక్రమించారు. మున్సిపల్ కౌన్సిల్‌తో పనిలేకుండానే గతేడాది ఆగస్టులో 85 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తొలగింపు నోటీసులను అందజేశారు. దీనిపై విమర్శలు రావడం.. కూటమి నేతల మధ్య విభేదాలతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ ఇప్పుడు అదే ప్రక్రియకు తెర తీశారని సమాచారం.

**ఆర్థిక భారం తగ్గించాలని..**

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల సంగతి ఎలాగున్నా, వీరికి మాత్రం ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు వచ్చేలా చూసింది. వీరి హాజరును జిల్లా కలెక్టర్ ద్వారా కార్పొరేషన్‌కు వెళుతుంటే వీరికి వేతనాలు క్రమం తప్పకుండా వస్తుండేవి. మధ్యలో ఎవరికీ ఎలాంటి కమీషన్లు ఉండేవి కావు. వీరికి ఉద్యోగ భద్రత కూడా ఉంది. నిర్దిష్టమైన ఆరోపణలు.. అవి కూడా నిరూపణ అయితేనే వీరిని ఉద్యోగం నుంచి తొలగించడానికి అవకాశం లేకుండా చేశారు. అయినప్పటికీ పనులు సరిగ్గా చేయడం లేదనీ.. మున్సిపాలిటీ ఆర్థికభారం తగ్గించుకోవాలనే నెపంతో తొలగింపునకు పూనుకున్నారు.

## బార్‌లకు రాని దరఖాస్తులు

తెనాలి రూరల్: తెనాలిలో బార్‌లకు సోమవారం సాయంత్రం వరకూ ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మంగళవారంతో గడువు ముగియనుండడంతో సాయంత్రం దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో 19 బార్లు ఉన్నాయి. వీటిలో 17 అన్ రిజర్వుడ్ కేటగిరీకి చెందినవి కాగా రెండు కల్లు గీత కులాలకు రిజర్వ్ చేశారు.

## పింఛను పంపిణీ బాధ్యత నుంచి మినహాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కొల్లిపర: సామాజిక పింఛన్లు ఇచ్చే బాధ్యత నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సోమవారం కొల్లిపర తహసీల్దార్ జి.సిద్ధార్థకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ విధులకు ఇబ్బంది కలిగించే ఈ సామాజిక పింఛన్ల పంపిణీ బాధ్యత నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మలజ్యోతి, ఎం.సీతమ్మ, ఎస్.లక్ష్మి, లక్ష్మీదేవి, టి.లావణ్య, ఎం.వసంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## అధికార భాషా సంఘానికి ఆ పేరు తగదు

ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పురుషోత్తమ శర్మ



తెనాలి: రాష్ట్ర అధికార భాషా సంఘానికి గిడుగు శ్రీరామమూర్తి పంతులు లేదా తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణలో ఎవరో ఒకరి పేరిట నామకరణం చేయాలని ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ ప్రభుత్వాన్ని కోరారు. అధికార భాషా సంఘానికి, దివంగత నేత మండలి వెంకటకృష్ణారావు పేరు పెట్టడం పట్ల ఆయన సోమవారం ఒక ప్రకటనలో విస్మయం వ్యక్తం చేశారు. మండలి వెంకటకృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన రాజకీయనేతగా పేర్కొంటూ.. అధికార భాషా సంఘానికి పేరు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. గిడుగు శ్రీరామమూర్తి లేదా విశ్వనాథ సత్యనారాయణ వంటి ప్రముఖుల పేరు పెడితే అధికార భాషాసంఘం ప్రతిష్ట పెరుగుతుదని అభిప్రాయపడ్డారు.

## ఇనుప గడ్డర్లతో ఇబ్బందులు

వంతెన నిర్మాణం చేయాలని వినతి



వినాయక విగ్రహాన్ని క్రేన్ సాయంతో గడ్డర్లను దాటిస్తున్న యువకులు

తెనాలి రూరల్: తెనాలి–రేపల్లె రైలు మార్గంలోని వైకుంఠపురం రైల్వే వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఇనుప గడ్డర్లతో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తెనాలి–చందోలు రహదారిపై ఉన్న ఈ వంతెన నిర్మించి సుమారు శతాబ్ద కాలం దాటింది. బలహీనంగా ఉందంటూ భారీ వాహనాల వల్ల వంతెనకు ఇబ్బందులు తలెత్తకుండా గడ్డర్లను నిర్మించారు. అయితే వీటి వల్ల తరచూ వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైల్వే వంతెన నుంచి వెళ్లే వాహనాల ఎత్తు, వైశాల్యాన్ని నియంత్రిస్తూ ఈ గడ్డర్లను ఏర్పాటు చేశారు. ఇవి తరచూ విరిగి పడుతుండడం, వాహనాలకు తగిలి దెబ్బతినడం వంటి కారణాలతో ఈ రహదారిలో తరచూ వాహనాల రాకపోకతకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**రాకపోకలకు అవస్థలు..**

వినాయక చవితి సందర్భంగా బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మోపర్రు గ్రామానికి చెందిన యువకులు సుమారు 14 అడుగుల విగ్రహాన్ని కొనుగోలు చేసి గ్రామానికి ఆదివారం రాత్రి తీసుకెళుతుండగా ఈ ఇనుప గడ్డర్లు విగ్రహానికి తగిలాయి. దీంతో యువకులు క్రేన్‌ను తీసుకువచ్చి గడ్డర్లను దాటించే ప్రయత్నం చేసినా సాధ్యపడలేదు. దీంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చివరికి చేసేది లేక మరో వాహనంలో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. కోవిడ్ సమయంలో నెలల పాటు రైళ్ల రాకపోకలను ఆ శాఖ రద్దు చేసింది. ఆ సమయంలోనైనా ఇటువంటి బలహీనంగా ఉన్న వంతెనలను పడగొట్టి కొత్తవి నిర్మిస్తే ఇటువంటి గడ్డర్ల ఇబ్బందులు ఉండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ఎటువంటి కోచింగ్ లేకుండా డీఎస్సీలో 8వ ర్యాంకు



జి. నీలిమ

చేబ్రోలు: మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన జి.నీలిమ డీఎస్సీలో 8వ స్థానంలో నిలవటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తరెడ్డిపాలెం కేసీ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన నీలిమ, ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. అనంతరం ఇదే ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు గొడుగునూరి వెంకటేశ్వరరావుతో వివాహం జరిగింది. భర్త ప్రోత్సాహంతో దూరవిద్యా విధానంలో డిగ్రీ పూర్తి చేసిన నీలిమ తరువాత బీఈడీ పూర్తి చేశారు.